శ్రీరస్తు                                                                 శుభమస్తు



# స్వాగత కుసుమాంజలి

## తల్లీ ఉషామణీ !

కార్యేషుదాసి కరణేషు మంత్రి యన్న చందాన వర్తించి, నిజజీవితములో భర్త శ్రీ నాగభూషణంగారి ప్రియతమ ఇల్లాలివై ఆదర్శ గృహిణివైనావు! ఏపురుషుని ఘనతకైనా వెనుక ఒక స్త్రీ వుంటుందన్న విషయాన్ని మీరు అక్షరసత్యం చేశారు. ఆదర్శప్రాయమైన మీ నడవడిక, పారదర్శకత, స్వచ్ఛత, నిరాడంబరత ఎల్లరూ నేర్చుకోవాల్సిన మాదిరి ఆచరించి చూపితిరి. నిండు ముత్తయిదువుగా, ఆదిమాత పార్వతిలా మీరు అందరికీ తల్లిగానే భాసిస్తారు. ఉషాకిరణ ప్రసారంజన చైతన్యానికి నాంది. మీ మాటలు, చేతలు ఉషః కిరణాలవంటివే. సార్థక నామధేయవు తల్లీ !

## వీరపత్నీ !

సత్యభామ వంటి పురాణ స్త్రీల దగ్గర నుండి రాణి రుద్రమ, మగువ మాంచాల, ఝాన్సీలక్ష్మీ, కెప్టెన్‌లక్ష్మీ, ఇందిరవంటి సమరశీలురెందరో యీ భారత జనయిత్రి ముద్దుబిడ్డలున్నారు. వారివలెనే స్వాతంత్ర్యసమర రంగాన నిలిచిన భర్తకు చేదోడు వాదోడుగా నిల్చి, ఉత్తేజాన్నిచ్చిన నీవనత నదాశ్లాఘనీయము. స్వయముగా మీరుకూడా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జాతీయగీతాలాలపిస్తూ, జాతీయజెండాలనెగురవేస్తూ, లాఠీదెబ్బలు తింటూ, సుదూరపు జైళ్ళలో మ్రగ్గుతూ అనేక కష్టనష్టాలకోర్చిన మీ సహనము సర్వులకు ఆదర్శప్రాయము తల్లీ.

## వీర సైనికాగ్రేసరా !
## అంగలూరి కేసరీ !

చిన్న రైతుకుటుంబంలో పుట్టి కొలదిపాటి చదువుతోనే చాలించి, పోలీకవృత్తి కంటే దేశస్వాతంత్ర్యం మిన్నయని యెంచి గాంధీజీ వంటి మహాత్ములబోధలచే చైతన్యవంతులై, సంసారసౌఖ్యాలకంటె దేశసౌభాగ్యమే మిన్నయని తలచి మహానాయకుల అడుగుజాడలలో నడచి, స్వాతంత్ర్యోద్యమ దీప్తిని మీరు మీ సహచరులు పల్లెలకందించి, స్పందింపజేసి వారిచేయూతను పొందగల్గిన మీరు నిజమైన వీరులు. పెద్దల మాటలను తు. చ. తప్పక అనేక ఉద్యమాలలో పాల్గొన్న మీరు నిజమైన సైనికులు. ఎన్నిసార్లు లాఠీ దెబ్బలను రుచిచూసినా, సుమారు పది మాసాలు జైలు శిక్షలననుభవించిన మీ స్వాతంత్ర్య సాధనాదీక్ష 'ఇంతింతై వటుడింతై' అన్న చందాన దినదినాభివృద్ధిచెందిందేగాని నీరసించలేదు. అందువల్ల మీరు వీరసైనికాగ్రేసరులే ! **ఈ అంగలూరి కేసరులే !**

## దేశభక్తాగ్రణీ
## నాగభూషణాచార్యా !

పెద్దల అడుగులజాడల్లో నడిచి మొక్కవోని ధైర్య సాహసాలను ప్రదర్శించి వ్యక్తి సత్యాగ్రహం మొదలు క్విట్‌యిండియా వరకు, గాంధీగారివలె 1920 నుండి 1947 వరకు యినుమడించిన ఉత్సాహంతో మీరుచేసిన అనుపమాన త్యాగాలు జాతికి ఆదర్శప్రాయాలు. మీ బిడ్డలకు మీరు పెట్టిన విజయ, క్రాంతి, ఆజాద్, ఆనంద్ నామకరణాలు మీత్రికరణశుద్ధిగల్గిన దేశభక్తికి నిదర్శనాలు.

స్వాతంత్ర్య విజయాకాంక్ష , స్వాతంత్ర్యకోసం విప్లవం, స్వాతంత్ర్యసిద్ధి, ఆసిద్ధివలన ఆనందము యిది మీరిచ్చిన నామకరణాల ఆదర్శముగా మేంభావిస్తున్నాం. విప్లవకాలంలోనే ఎన్నోవేలమందికి హిందీ విద్యాదానంచేసి ఆచార్యవర్యులైనారు.

## శతవసంత విజయవిహారీ !

" శతాయుష్మాన్‌భవ" అనే పెద్దలమాటను మీరు నిలబెట్టారు. ఇన్ని కష్టనష్టాలకోర్చి కఠినమైన ఉద్యమాల్లో పాల్గొంటూ యింతా కాలిన్నంగల్గిన జీవితాన్ని రుచిచూసిన మీరు శతవసంతాలు పూర్తిచేసుకొన్న యీ శుభతరుణంలో ఆ భగవంతునికి మేమందరము మీతరపున శతసహస్రవందనాలర్పిస్తున్నాం. మీకింకా ఆభగవంతుడు దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యాలనివ్వాలని త్రికరణశుద్ధిగా ఆకాంక్షిస్తున్నాం.

మీ నిరాడంబరత, నిస్వార్థత, సహనశీలతకు మాజోహారులు.

చంద్రునికో నూలుపోగులా మేమందిచే యీ అభినందన చందన కుసుమాంజలి స్వీకరించి మమ్ములీవించు మహర్షీ!

ఇట్లు

అంగలూరు
24-01-2001

**శ్రీ ఆరెకపూడి నాగభూషణం దంపతుల సన్మానసంఘం,**
**అంగలూరు.**

కమలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్, గుడివాడ. ☏ : 43047.